హైదరాబాద్
11-8-2023
సంపుటి:08
సంచిక: 340
పేజీలు: 4
వెల: రూ.5/-

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక


# వీఆర్‌ఏల విలీనానికి నో

## జూనియర్ అసిస్టెంట్లుగా వారి నియామకం చట్టవిరుద్ధం

- సర్కారు జారీ చేసిన జీవో 81, 85లను సస్పెండ్ చేసిన హైకోర్టు
- కేటగిరీలుగా ఎలా విభజించారు?.. అర్హతలను ఎలా నిర్ధారించారు?
- ఎంపిక ప్రక్రియ ఏమిటి?.. ఖాళీలు లేవంటూనే ఎలా సర్దుబాటు చేశారు?
- రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ప్రశ్నల వర్షం
- రెవెన్యూశాఖలో జూలై 24కు ముందున్న స్థితి కొనసాగించాలి
- ఇప్పటికే ఎవరైనా విధుల్లో చేరి ఉన్నా వెనక్కి వెళ్లాల్సిందేనని స్పష్టీకరణ
- ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశం

2లో

# యువత భవితకు జగన్ ఉరి!

రాష్ట్రం బాగుపడాలంటే సైకో పోవాలి.. సైకిల్ రావాలి

కొత్తూరు సభలో చంద్రబాబు పిలుపు

ఈ జనాన్ని చూస్తే ఆయన గుండె ఆగిపోతుంది

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత.. ఆయన ఓటమి ఖాయం

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు.. ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తా

వలంటీర్లతో ఈ సీఎం తప్పుడు పనులు చేయిస్తున్నాడు

పరదాల మాటున తిరుగుతూ జనాలకు పిడిగుద్దులు


మేమొస్తే 20 లక్షల ఉద్యోగాలు.. రైతన్నకు ఏటా 20 వేలు

మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 3 సిలిండర్లు

టీడీపీ అధినేత హామీలు.. శ్రీకాకుళం ప్రాజెక్టుల పరిశీలన

2లో





2లో

## డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌లకు గ్రీన్ సిగ్నల్

158 ఎకరాల అప్పగింతకు ఆర్మీ అంగీకారం

మంత్రి కేటీఆర్ వినతుల నేపథ్యంలో స్పందించిన రక్షణ శాఖ

రాజీవ్ రహదారి, నాగ్‌పూర్‌హైవే మార్గాల్లో రెండు ప్రాజెక్టులకు తొలగిన అడ్డంకులు

రెండు మార్గాలు

200 అడుగుల మేర విస్తరణ

కంటోన్మెంట్ (హైదరాబాద్): ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కైవేల ప్రాజెక్టు ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. కీలకమైన స్థల సేకరణకు వీలుగా ఆర్మీ



## వైసీపీ కబ్జాదారులూ ఖబడ్దార్!

విశాఖపట్నం, "ఆంధ్రప్రదేశ్‌ని గంజాయి అడ్డాగా మార్చేశారు

ఉత్తరాంధ్రను డంపింగ్ యార్డుగా చేశారు

ప్రాణాలకు తెగించే విశాఖకు వచ్చా

అరాచకం చేస్తే కాలుకు కాలు, కీలుకు కీలు తీస్తా

జగన్ నేత కాదు..వ్యాపారి, కమీషన్ ఏజెంట్

సారా నుంచి సిమెంట్‌దాకా వ్యాపారాలన్నీ జగన్‌వే

ఒక్క మద్యం ద్వారానే జగన్‌కు రూ.30 వేల కోట్లు

పొద్దున స్కీమ్ సొమ్ము ఇవ్వడం..

సాయంత్రం సారాతో

లాక్కోవడం.. ఇదే జగన్ పాలన..


గంజాయి అడ్డాగా ఏపీ

మళ్లీ చాన్సిస్తే ఏపీని ఎవరూ కాపాడలేరు

జగన్‌కు సీఎం అయ్యే అవకాశం ఇవ్వను..

విశాఖలో స్థలం తీసుకుంటా.

కార్యాలయం పెడతా: పవన్




## మూడోసారీ మార్పులేదు

- కీలక రెపో రేటు 6.5 శాతంగా యథాతథం...
- కొనసాగుతున్న ద్రవ్యోల్బణం భయాల ప్రభావం
- ఆహార ధరలు పెరిగితే రేటు పెంపు తప్పదని సంకేతం
- 5.1 శాతం నుంచి 5.4 శాతానికి ద్రవ్యోల్బణం అంచనా పెంపు
- 2023-24 వృద్ధి రేటు అంచనా 6.5 శాతంగా పునరుద్ఘాటన

ముంబై: ధరల స్పీడ్‌ను కట్టడి చేసే విషయంలో రాజీ పడేదే లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. ఆహార ధరలు పెరుగుతుంటే దీని కట్టడికి అవసరమైతే రేటు పెంపే ఉంటుందని ఉద్ఘాటించింది. రిటైల్ ద్రవ్యోల్బణం అనిశ్చితి నేపథ్యంలో బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు

2లో

# అధికారంపైనే ఆకలి

## ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ప్రధాని మోదీ



- యూపీఏకు అంత్యక్రియలు.. 'ఇండియా'కు నామకరణం
- అది ఇండియా కూటమి కాదు.. అహంకారుల కూటమి
- పేరు మార్చుకున్నంత మాత్రాన అధికారం రాదు
- చేతులు కలుపుతారు.. ఆపై కత్తులతో పొడుచుకుంటారు
- అహంకారంతోనే కాంగ్రెస్ 400 నుంచి 40 సీట్లకు..
- అవిశ్వాసం పెడుతూనే ఉంటారు.. వీగుతూనే ఉంటుంది
- మణిపూర్‌లో శాంతి తథ్యం.. వారికి అండగా దేశం: మోదీ
- ప్రధాని ప్రసంగిస్తుండగానే విపక్ష సభ్యుల వాకౌట్
- 2029లోనూ మేమే

న్యూఢిల్లీ: విపక్షాలకు ఉన్నదంతా అధికారంపై ఆకలి మాత్రమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దునుమాడారు. నిర్మాణాత్మకంగా అవి ఎప్పుడూ ప్రవర్తించలేదని మండిపడ్డారు. "దేశాన్ని విభజిస్తూ అవి ఓ కూటమి పెట్టుకున్నాయి. బెంగళూరులో యూపీఏ పేరుకు అంత్యక్రియలు చేసి ఐ డాట్ ఎన్ డాట్ డీ డాట్ అంటూ 'ఇండియా' అని పేరు పెట్టుకున్నాయి. పేరుతోనే ఇండియాను ముక్కలు చేశాయి. అది ఇండియా కాదు.. ఘమండియా (అహంకారుల కూటమి). గతంలో ఎన్డీయే ఉండేది. ఇప్పుడు దానికి రెండు 'ఐ'లు కలుపుకొన్నాయి. వాటిలో ఒకటి 26 పార్టీల అహంకారం అయితే.. మరొక 'ఐ' కాంగ్రెస్ అహంకారం. పేరు మార్చుకోవడం ద్వారా ఇండియాలో అధికారంలోకి వచ్చేస్తామని కలలు కంటున్నాయి. కానీ, పేరు మార్చుకున్నంత మాత్రాన అధికారం రాదు" అంటూ ధ్వజమెత్తారు. తమ కూటమికి పేర్లు మార్చుకోవడం వాటికి కొత్త కాదని, కారు పాత ఇంజిన్‌కే రంగులేసి ఎలక్ట్రిక్

మిగతా 2 లో


## నిండు సభలో జయలలిత చీరను లాగినవారా..

- ద్రౌపది గురించి మాట్లాడేది?
- కనిమొళి వ్యాఖ్యలపై నిర్మల నిప్పులు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: మణిపూర్ మహిళలకు జరిగిన అవమానాన్ని ద్రౌపదికి జరిగిన అవమానంతో పోలుస్తూ డీఎంకే ఎంపీ కనిమొళి బుధవారం సభలో చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రస్థాయిలో స్పందించారు. అవిశ్వాసతీర్మానంపై చర్చలో భాగంగా గురువారం నిర్మల మాట్లాడారు. మహిళలను అవమానించడం, అప్రతిష్ఠపాలు చేయడం వంటి ఘటనలు

మిగతా 2 లో

# పాలమూరుకు గ్రీన్ సిగ్నల్



- పర్యావరణ అనుమతులకు ఈఏసీ సిఫారసు
- ఇక కేంద్ర జలశక్తిశాఖ అనుమతి లాంఛనమే
- తెలంగాణ సర్కారు అపూర్వ, చారిత్రక విజయం
- కుట్రలు ఛేదించి.. కేసులను అధిగమించి విజయం
- నెరవేరిన మహబూబ్‌నగర్ ప్రజల దశాబ్దాల కల
- సాగునీటి పనులు చేపట్టేందుకు మార్గం సుగమం
- ఇప్పటికే తుదిదశకు మొదటిదశ తాగునీటి పనులు
- పర్యావరణ అనుమతులపై సర్వత్రా హర్షాతిరేకం


హైదరాబాద్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ సర్కారు మరో అపూర్వ, చారిత్రక విజయాన్ని సాధించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమేకాకుండా, అనుమతుల సాధనలోనూ సాటిలేని మేటి రాష్ట్రంగా నిలిచింది. పాలమూరు బిడ్డల దశాబ్దాల కలను సాకారం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి

2లో

# సాంపాదకీయం

## రాజ్యాంగం రాజకీయం వేరైన దుస్థితి!

పంద్రాగస్టు పండగ అంటే– మువ్వన్నెల జెండా ఎగరవేసి, జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి, సాయంత్రం టీవీలో సర్దార్ పాపారాయుడు లాంటి దేశభక్తి సినిమా చూసి ముగించే సెలవు దినంగా చూడడం ఆనవాయితీగా వస్తూ ఉన్నది. కానీ ఎంతకాలం ఇలా? మనం ఒక జాతిగా మరికాస్త లోతుగా ఆలోచించవలసిన అవసరం ఉంది. అందుకు అమృతోత్సవాలు ముగిసిన తర్వాత వస్తున్న ఈ పంద్రాగస్టును ఒక సందర్భంగా భావించవచ్చు. మనది ఒకనాడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. కానీ నేడు అది ప్రధానమంత్రిత్వ ప్రజాస్వామ్యంగా మారిపోయింది. ఈ స్థితిలో రాజ్యాంగ వ్యవస్థ అంతా ఒక్క వ్యక్తి చుట్టూ పరిభ్రమిస్తున్నది. ఆ వ్యక్తే శక్తిగా మారి యావత్ దేశాన్ని శాసించే పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా మన రాజ్యాంగంలో పార్లమెంటుకు కల్పించిన విశిష్ట స్థానాన్ని మనం నిలబెట్టుకోలేకపోయాము. ఒక వ్యవస్థగా పార్లమెంటు మొదటి నుంచీ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మ అయ్యింది. పార్లమెంటరీ పరిభాషలో మంత్రులు మినహా, సభ్యులందరూ ప్రైవేట్ మెంబెర్స్‌గానే పరిగణింపబడతారు. అధికార పక్షం సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు అనే తేడా లేదు. ప్రభుత్వ తీరును సునిశితంగా గమనిస్తూ, ప్రశ్నల రూపంలో ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టాల్సిన బాధ్యత సభ్యులందరిదీ. ఈ బాధ్యత పార్టీలకతీతమైనది. కానీ, రాజకీయ కారణాలతో, ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనించే పాత్రను సభ్యులు విస్మరించారు. అధికార పక్షం సభ్యులు గనక ప్రభుత్వ పనితీరు మీద అదే పనిగా ప్రశ్నలు సంధించుతుంటే పార్టీ నాయకత్వం దృష్టిలో అసమ్మతివాదులుగా ముద్రపడతారు అని భయం. వచ్చే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్టు దక్కదని భయం. పరిణతి గల ప్రజాస్వామ్య వ్యవస్థలో సభలో ప్రజాప్రతినిధుల పాత్రకు నాలుగు కోణాలుంటాయి. మొదటగా తమ మనస్సాక్షి ప్రకారం నడుచుకోవాలి. రెండవది తనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవాలి. మూడవది పార్టీకి విశ్వసనీయంగా నడచుకోవాలి. తనకు టిక్కెట్టు ఇచ్చిన పార్టీ నాయకత్వం, మేనిఫెస్టో, ఎన్నికల గుర్తు, పార్టీ కార్యకర్తలు, నాయకులు చేసిన ప్రచారం ఆధారంగా గెలుపొందుతారు గనక పార్టీ పట్ల బాధ్యతను విస్మరించరాదు. ఇహ నాలుగవది ఏ రాజ్యాంగం మీద ప్రమాణం చేశారో ఆ రాజ్యాంగ విలువలను నిలబెట్టే విధంగా నడుచుకోవాలి. కొన్ని సందర్భాల్లో సభ్యులు ఈ నాలుగు కోణాల మధ్య సంఘర్షణకి లోనవుతారు. సభ్యుల విజ్ఞత, పరిణతితోనే ఈ సంఘర్షణ నుంచి బయటపడగలరు. అయితే నేడు కేవలం పార్టీ అభీష్టం మేరకే నడుచుకోవటానికి మొగ్గు చూపుతున్నారు. అందువలన ప్రశ్నించటం అనేది ప్రతిపక్షాలకే పరిమితమైంది. కానీ ప్రభుత్వం ఏమి చేసినా వ్యతిరేకించాలి అన్న ధోరణిలో ఉంటున్నాయి ప్రతిపక్షాలు ఈ మధ్యకాలంలో. ప్రతిపక్షం ప్రజల మనోభావాలను ప్రతిబింబించేలా వ్యవహరించాలిగానీ ప్రతిపక్షం కాబట్టి ప్రభుత్వం ఏం చేసినా దాన్ని వ్యతిరేకించాలనుకోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకం. అది ప్రజల తీర్పును గౌరవించకపోవటమే.




# వీఆర్ఏల విలీనానికి నో

హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)లను క్రమబద్ధీకరించి, జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. వీఆర్ఏల నియామకం చట్టవిరుద్ధమని, అది చెల్లదని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 81, 85లను సస్పెండ్ చేసింది. రెవెన్యూ శాఖలో జూలై 24న జీవో 81 జారీకి ముందున్న పరిస్థితినే కొనసాగించాలని స్పష్టం చేస్తూ.. స్టేటస్‌కో ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా వీఆర్ఏలు ఇప్పటికే కొత్త విధుల్లో చేరినా వారు తిరిగి వెనక్కి వెళ్లాలని తేల్చిచెప్పింది.

ఇక పిటిషనర్ల విజ్ఞప్తి మేరకు.. ప్రతివాదుల జాబితా నుంచి సీఎం కేసీఆర్, ఎన్నికల సంఘం, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌ను తొలగించింది. వీఆర్ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడంపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. వీఆర్ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆఫీస్ సబార్డినేట్లు.. వయసు ఎక్కువున్న వారికి పింఛన్ వంటి ప్రయోజనాలు లేకుండా చేశారని వీఆర్ఏలు ఇలా వివిధ అంశాలపై హైకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపున న్యాయవాదులు పీవీ కృష్ణయ్య, శ్రీరాం పొలాలి.. ప్రభుత్వం తరపున జీపీ రామారావు వాదనలు వినిపించారు. నవీన్ మిట్టల్ తీరు సరిగా లేదు..

### సబార్డినేట్లకు అన్యాయం

తొలుత పిటిషనర్ల తరపున పీవీ కృష్ణయ్య, శ్రీరాం పొలాలి వాదిస్తూ.. "చట్ట ప్రకారం ఉద్యోగాల నియామకానికి ఒక ప్రక్రియ ఉంటుంది. వీఆర్ఏల విషయంలో ఆ ప్రక్రియ చేపట్టలేదు. సర్వీస్ రూల్స్‌లోనూ ఎలాంటి మార్పు చేయలేదు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంలో రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టు జీవోలు జారీ చేసింది. సీనియర్లలో 19వ స్థానంలో ఉన్న నవీన్ మిట్టల్‌ను ఉద్దేశపూర్వకంగా సీసీఎల్ఏగా నియమించింది. దీనికి కృతజ్ఞతగా ఆయన చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోకుండానే ప్రొసీడింగ్స్ ఇచ్చేస్తున్నారు. సీసీఎల్ఏగా మిట్టల్ నియామకం చెల్లదు.

రాత్రి జీవోలు ఇచ్చి ఉదయానికల్లా విధుల్లో చేరాలని ఆదేశించడం ఇంత వరకు ఎక్కడా, ఎప్పుడూ జరగలేదు. పైగా అంతా ఇప్పటికే విధుల్లో చేరారని కోర్టుకు చెప్పడం హాస్యాస్పదం. రాజ్యాంగబద్ధమైన కోర్టుల ముందు ఇలాంటి చర్యలను సమర్థించుకోజాలరు. ఓ వైపు సర్వీస్ నిబంధనలు అవసరం లేదంటూనే.. మరోవైపు అవసరమైతే జారీ చేస్తామనడం శోచనీయం. రాష్ట్రంలో ఆఫీస్ సబార్డినేట్లు ఏళ్లతరబడి ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.దవారిని కాదని వీఆర్ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడం సరికాదు. వీఆర్ఏల సర్దుబాటు పేరిట ఆఫీస్ సబార్డినేట్లకు అన్యాయం చేయడం తగదు. అదేవిధంగా వీఆర్ఏలకు పదవీ విరమణ ఉండదు. దీన్ని అడ్డుపెట్టుకుని వారికి పింఛన్, గ్రాట్యుటీ వంటివి ఇవ్వకుండానే రిటైర్ అయ్యేలా చేయడం అన్యాయం. ఇది వయసు మీద పడిన వీఆర్ఏలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతుంది. దీనిపై పిటిషన్లు వేసిన వారిని ప్రభుత్వం బెదిరింపులకు

# అధికారంపైనే ఆకలి

(మొదటి పేజీ తరువాయి)

ఇంజిన్ అని చెప్పుకొంటారని ఎద్దేవా చేశారు. కాంగ్రెసకు అనుకరణ తప్ప సొంతంగా ఆలోచించడం రాదని, ఎన్నికల గుర్తు నుంచి కూటమి పేరు వరకూ అరువు తెచ్చుకుందని విమర్శించారు. "పరిస్థితులను బట్టి ఇప్పుడు చేతులు కలుపుతారు. పరిస్థితులు మారితే కత్తులతో పొడుచుకుంటారు. పశ్చిమ బెంగాల్‌లో మమతపై వామపక్షాలతో కలిసి పోరాడుతూ ఢిల్లీలో చేతులు కలిపారు. కేరళలో తమపై దాడి చేసిన వామపక్షాలతోనే స్నేహం చేస్తారు" అని ధ్వజమెత్తారు. ఒక కుటుంబ అధికార దాహానికి ఇతర పార్టీలు బలి కావద్దని, ఇండియా కూటమిలో ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి కావాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తన ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై గురువారం ఆయన సమాధానమిచ్చారు. విపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ.. చలోక్తులు విసురుతూ.. తనదైన శైలిలో క్రికెట్ పరిభాషను ఉపయోగిస్తూ దాదాపు రెండు గంటలకుపైగా మాట్లాడారు."అవిశ్వాస తీర్మానంపై మీరేం చర్చించారు!? మీ మద్దతుదారులు కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇది మీ పరిస్థితి. విశేషం ఏమిటంటే.. మీరు ఫీల్డింగ్ చేస్తుంటే.. మేం ఫోర్లు, సిక్స్‌లు కొట్టాం. మేం సెంచరీలు కొడుతుంటే.. మీరు నో బాల్స్ వేస్తున్నారు. అవిశ్వాస తీర్మానాన్ని మీరే ప్రవేశపెట్టారు. మరి ముందస్తుగా అందుకు సిద్ధమై ఎందుకు రాలేదు!?" అని నిలదీశారు. 2018లోనూ తనపై అవిశ్వాసం పెట్టి విఫలమయ్యారని, అప్పట్లో వారికి కనీసం ఉన్న ఓట్లు కూడా రాలేదని, ఆ తర్వాత ఎన్నికల్లో తాము మాత్రం ఘన విజయం సాధించామని గుర్తు చేశారు. 2018లో తాను వారికి ఐదేళ్ల సమయం ఇచ్చానని, అయినా, అవిశ్వాస తీర్మానంపై చర్చకు వాళ్లు హోంవర్క్ చేసుకుని రాలేదని, ఇప్పుడు 2028 వరకు సమయం ఇస్తున్నానని మోదీ అన్నారు. 2024లో కూడా మళ్లీ ఎన్డీయేదే విజయమని, 2028లో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంటుందని, అప్పుడు కూడా వాళ్లు అవిశ్వాసం పెడతారని, ఆ తర్వాత 2029లోనూ తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. విపక్షాలు అవిశ్వాసం ఎప్పుడు పెట్టినా అది తమకు శుభ సూచకమని చెప్పారు. అయితే, మోదీ సమాధానం పూర్తి కాకముందే మణిపూర్ అంశంపై ప్రధాని మాట్లాడడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం, అవిశ్వాస తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో తిరస్కరించింది. ప్రతిపక్షాలు ఎవరి గురించి అయినా చెడుగా ఆలోచిస్తే వారికి కచ్చితంగా మంచే జరుగుతుందని, తన విషయంలో కూడా అదే జరిగిందని ప్రధాని మోదీ తెలిపారు. వారు నల్ల దుస్తులు ధరించి వస్తే తనకు దిష్టి తీసినట్లేనని అన్నారు. "నా హయాంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కుప్పకూలిపోయాయని కాంగ్రెస్ వారన్నారు. కానీ, అవి ఇప్పుడు భారీ లాభాలతో నడుస్తున్నాయి. హెచ్ఏఎల్, ఎల్ఐసీలపై కూడా వాళ్లు చేసిన విమర్శలు తప్పయ్యాయి. అవి ఇప్పుడు లాభాలను ఆర్జిస్తున్నాయి. విపక్షాలు ఏ ప్రభుత్వ సంస్థలపై విమర్శలు చేస్తాయో వాటిపై షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడితే కచ్చితంగా లాభాలు వస్తాయి" అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఎన్నిసార్లు విఫలమైనా ఆయనను పదే పదే ప్రయోగిస్తుంటారని విమర్శించారు. భారత దేశంపై విదేశీ సంస్థలు చేసిన దుష్ప్రచారాన్ని ప్రచారం చేసి సంతోషపడడం ప్రతిపక్షాలకు ఆనవాయితీగా మారిందన్నారు.

## నిండు సభలో జయలలిత చీరను లాగినవారా..

(మొదటి పేజీ తరువాయి)



మణిపూర్‌లోనే కాక రాజస్థాన్, ఢిల్లీ.. ఇలా ఎక్కడ జరిగినా తీవ్రంగా పరిగణించాల్సిందేనన్న ఆమె.. 1989, మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘటనను కనిమొళికి గుర్తుచేశారు. "ఆరోజు.. నిండు సభలో విపక్ష నేత జయలలిత చీరను డీఎంకే సభ్యులు లాగేశారు. ఆమెను ఎగతాళి చేశారు. రెండేళ్ల తర్వాత అదే జయలలిత తమిళనాడు ముఖ్యమంత్రిగా అదే సభలోకి అడుగుపెట్టారు. ఆరోజు నిండు సభలో విపక్ష నేత చీరలాగినప్పుడు అధికారంలో ఉన్న పార్టీ ఇవాళ ద్రౌపది గురించి మాట్లాడుతోంది" అని నిప్పులు చెరిగారు. కాగా, లోక్‌సభలో రాహుల్ గాంధీ ఫ్లయింగ్ కిస్ ఇచ్చారంటూ స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన స్మృతి ఇరానీకి.. టీఎంసీ ఎంపీ మహువామొయిత్రా కౌంటర్ ఇచ్చారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ పేరు ప్రస్తావించకుండా.. ఆయన విషయంలో మౌనం పాటించడమేంటంటూ నిలదీశారు.

# మూడోసారీ మార్పులేదు

(మొదటి పేజీ తరువాయి)

రెపోను (ప్రస్తుతం 6.5 శాతం) యథాతథంగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. 2024 మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణానికి సంబంధించి క్రితం 5.1 శాతం అంచనాలను 5.4 శాతానికి పెంచుతూ ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వంలో సమావేశమైన ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన (ఎంపీసీ) కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధి రేటు అంచనాలను ప్రస్తుత 6.5 శాతంగానే కొనసాగించాలని మూడురోజులపాటు సమావేశమైన కమిటీ నిర్ణయించింది. మంగళ, బుధ, గురు వారాల్లో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశ వివరాలను గవర్నర్ శక్తికాంతదాస్ వివరించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ గడచిన మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో తాజా సమీక్ష సహా గడచిన మూడు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది. అయితే ద్రవ్యోల్బణం భయాలు పూర్తిగా తొలగిపోలేదని, అవసరమైతే కఠిన ద్రవ్య విధానానికే (రేటు పెంపు) మొగ్గుచూపుతామని కూడా ఆయా సందర్భాల్లో స్పష్టం చేస్తూ వచ్చింది. ఇదే విషయాన్ని తాజా సమీక్షా సమావేశం అనంతరం కూడా ఆర్‌బీఐ గవర్నర్ పునరుద్ఘాటించారు.

# పాలమూరుకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ అనుమతులను సాధించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ (ఈఏసీ) కేంద్ర జల్‌శక్తిశాఖకు సిఫారసు చేయగా, అనుమతులు ఇక లాంఛనప్రాయమే కావడం విశేషం. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం 34వ ఈఏసీ సమావేశం నుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఈఏసీ సభ్యులు సందేహాలను లేవనెత్తుతూ, నివేదికలను కోరుతూ వాయిదా వేస్తూ వచ్చారు. ఒక దశలో ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల మంజూరును సైతం తిరస్కరిస్తూ ప్రాజెక్టు ప్రతిపాదనలను పక్కనపెట్టింది. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో ఈఏసీ కోరిన విధంగా సంబంధిత డాటాను సమర్పించింది. దీంతో ఎట్టకేలకు ఈ ఏడాది జూన్ 27న నిర్వహించిన ఈఏసీ 48వ సమావేశంలోనే పాలమూరు ప్రాజెక్టు ప్రతిపాదనలపై సుదీర్ఘమైన చర్చ కొనసాగింది. అయిప్పటికీ ఈఏసీ సభ్యులు పలు అంశాలపై పూర్తి వివరాలను ఇవ్వాలని కోరుతూ అనుమతుల మంజూరును పెండింగ్‌లో పెట్టారు. దీంతో గత నెల 24న నిర్వహించిన 49వ ఈఏసీలో మరోసారి తెలంగాణ సర్కారు తరపున తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ వాదనలు వినిపించారు.

# వైసీపీ కబ్జాదారులూ ఖబడ్దార్!

విశాఖపట్నం: "ఆంధ్రప్రదేశ్‌ని గంజాయి అడ్డాగా మార్చేశారు. ఉత్తరాంధ్రను డంపింగ్ యార్డుగా చేశారు. కాలుష్య పరిశ్రమలతో ఈ ప్రాంతాన్ని నింపేశారు. విశాఖలో భూములను కబ్జా చేశారు. ప్రభుత్వ సంస్థల భూములను తనఖా పెట్టేశారు. వేల సంవత్సరాల నాటి ఎర్రమట్టి దిబ్బలను నాశనం చేస్తున్నారు. రుషికొండకు బోడిగుండు చేశారు" అని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆగ్రహించారు. వారాహి మూడో విడత యాత్రను ఆయన గురువారం విశాఖలో ప్రారంభించారు. జగదాంబ జంక్షన్‌లో రాత్రి ఏడు గంటలకు వారాహి వాహనం పై నుంచి ప్రజలను ఉద్దేశించి పవన్ మాట్లాడారు. జగన్‌ను తాను ఏకవచనంతో సంబోధిస్తానని మరోమారు స్పష్టంచేశారు. జగన్‌పై 36 క్రిమినల్ కేసులు ఉన్నాయని, అలాంటి వ్యక్తిని సీఎంగా ఎన్నుకుంటే...ఏమి జరుగుతుందో ఈ నాలుగేళ్లలో చూపించాడన్నారు. 2024లో మరోసారి ఆయనకు అవకాశం ఇస్తే...ఏపీని ఇక ఎవరూ కాపాడలేరన్నారు. ఆయనకు సీఎం అయ్యే అవకాశం తాను ఇవ్వనని, అడ్డం పడతానని స్పష్టంచేశారు. జగన్ నాయకుడు కాదని, ఒక వ్యాపారి అని, కమీషన్ ఏజెంట్ అని పవన్‌కల్యాణ్ విమర్శించారు. ఒక్క మద్యం వ్యాపారం ద్వారానే ఆయన రూ.30 వేల కోట్లు సంపాదించాడని, ఇప్పుడు అదే డబ్బు పెట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నాడని విమర్శించారు. ప్రశాంత నగరం విశాఖపట్నం కబ్జాదారులు చేతుల్లో చిక్కుకొని విలవిలలాడుతోందన్నారు. చివరికి రాజ్యాంగాన్ని కూడా జగన్ కాలరాస్తున్నాడు. కీలకమైన పదవులు, పోస్టులన్నీ ఒక సామాజిక వర్గానికే ఇస్తున్నారు. దీనిని జనసేన వ్యతిరేకిస్తోంది. మేం అధికారంలోకి వస్తే అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తా"మని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు.

### కాలం ఎంతో గొప్పది

విశాఖ తనకు అనేకం ఇచ్చిందని, ఇక్కడే తాను చాలా నేర్చుకున్నానని పవన్‌కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. "పాతికేళ్ల క్రితం ఇదే జగదాంబ సెంటర్‌లో 'సుస్వాగతం' సినిమా కోసం బస్సుపై డ్యాన్స్ చేయాల్సి వచ్చింది. పది మందిలో మాట్లాడాలంటే నాకు సిగ్గు. ఇప్పుడు పాతికేళ్ల తరువాత అదే జగదాంబ జంక్షన్‌కి వచ్చి లక్ష మందితో మాట్లాడుతున్నాను. కాలం చాలా గొప్పది. ఎవరైనా దానికి తల వంచాల్సిందే" నని పవన్ వ్యాఖ్యానించారు. ఉద్యోగాలు ఏవీ..?: అధికారంలోకి వస్తే రెండు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, 50 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని, సీపీఎస్ రద్దు చేస్తానని జగన్ చెప్పారని, అవన్నీ ఎక్కడ పూర్తిచేశారో చెప్పాలని పవన్ డిమాండ్ చేశారు. "పొద్దునే స్కీమ్ సొమ్ము ఇవ్వడం...సాయంత్రం సారా పేరుతో లాక్కోవడమే జగన్ పరిపాలనగా మారింది. విశాఖలో పది మంది వైసీపీ నేతలు కలిసి చేసే దోపిడీని లక్ష మంది ప్రజలు కలిసి ఎదుర్కొనవచ్చు. అలా ముందుకు వచ్చేవారికి నేను అండగా ఉంటాను" అని పవన్ భరోసా ఇచ్చారు.

# డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌లకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

అంగీకారం తెలుపడంతో రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవే మార్గాల్లో రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు ప్రధాన అడ్డంకులు తొలగిపోయాయి. స్కైవేలకు ఆర్మీ స్థలాలు ఇవ్వడం లేదంటూ మంత్రి కేటీఆర్ పదే పదే ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను కలిసి మరోసారి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో స్పందించిన రక్షణ శాఖ ఉన్నతాధికారులు తదనుగుణంగా చర్యలు చేపట్టాల్సిందిగా స్థానిక మిలటరీ అధికారులు (ఎల్ఎంఏ), కంటోన్మెంట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశా రు. 2017లోనే చేపట్టిన జాయింట్ సర్వేలో కొన్ని మార్పులు, చేర్పులతో తుది నివేదికను రూపొందించారు. రక్షణ వర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు ప్రతిపాదిత రోడ్ల విస్తరణకు ఆర్మీ, కంటోన్మెంట్ 158 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనుంది. ప్రైవేటు స్థలాలు దీనికి అదనం. ఇక ప్రతిపాదిత మార్గాల్లో ప్రస్తుత రోడ్లను 60 మీటర్ల (196 అడుగులు)కు విస్తరించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికే ఏఓసీ మార్గంలో రోడ్ల మూసివేత అంశం కొనసాగుతోంది. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కొలువు తీరాక ఈ ప్రాజెక్టును చేపట్టడంతో పాటు, సెక్రెటేరియట్‌ను కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేయాలని భావించింది. ప్రతిపాదిత సెక్రెటేరియట్ తూర్పు ద్వారం గుండా నేరుగా హకీంపేట వరకు రాజీవ్ రహదారి మీదుగా, పడమర ద్వారం గుండా సుచిత్ర వరకు మేడ్చల్ హైవే మీదుగా రెండు స్కైవేలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా సూత్రప్రాయ అంగీకారం తెలుపడంతో పాటు ఆర్మీ, కంటోన్మెంట్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జాయింట్ సర్వే కూడా పూర్తి చేశారు. ఈ మేరకు సెక్రెటేరియట్ కోసం 60 ఎకరాలు, స్కైవేలకు 90 ఎకరాల ఆర్మీ, కంటోన్మెంట్ స్థలాలు ఇవ్వాల్సి ఉంటుందని లెక్కతే ల్చారు. అయితే విలువైన స్థలాలను కోల్పోతున్న నేపథ్యంలో కంటోన్మెంట్‌కు ఏటా రూ.31 కోట్ల చొప్పున సర్వీసు చార్జీ చెల్లించాలని ప్రతిపాదించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. సెక్రెటేరియట్ నిర్మాణ ప్రతిపాదనను కూడా విరమించుకుని, పాతభవనం తొలగించి నిర్మించారు. వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ) కింద రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్%--%44) మార్గాల్లో స్కైవేల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఈ మార్గాల్లో రోడ్డును 150 అడుగుల మేరకు విస్తరించాలని నిర్ణయించారు. తాజాగా ఈ స్కైవేలను మెట్రో కోసం కూడా వినియోగించుకోవాల ని నిర్ణయించారు. దీంతో రెండు మార్గాలను సుమారు 200 అడుగుల మేర విస్తరించనున్నారు. దీంతో గతంలో 90 ఎకరాల ఆర్మీ, కంటోన్మెంట్ స్థలం మాత్రమే

# గోపాల మిత్రలను శాశ్వత ఉద్యోగులుగా పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలి





**హైదరాబాద్ ,సమ సమాజం:** రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అనుబంధంగా ఉన్న పశుగణాభివృద్ధి సంస్థ లో దాదాపు గత 23 సంవత్సరాలుగా 1530 మంది గోపాల మిత్రలు పనిచేస్తున్నారు. గోపాల మిత్రల యొక్క ముఖ్య విధి కృత్రిమ గర్భధారణ. రైతు ఇంటి ముంగిట పశువులకి కృత్రిమ గర్భధారణ చేస్తూ రైతుల నుండి ఒక కృత్రిమ గర్భధారణ రుసుము క్రింద 40 రూపాయలను సంస్థకి చెల్లించాల్సి ఉంటుంది. దాదాపు ప్రతి సంవత్సరం 18 నుండి 19 లక్షల డోసులు అంటే దాదాపు 7 నుండి 8 కోట్ల రూపాయలను సంస్థ కి చెల్లించడం జరుగుతుంది. ఈ 40 రూపాయలతో సంస్థ మనుగడ ముడి పడి ఉన్నందున ప్రతి గోపాలమిత్రకు ప్రతి నెల కొంత లక్ష్యం నిర్ణయించింది సంస్థ. ఇట్టి లక్ష్యాలను చేరకపోతే అట్టి గోపాలమిత్ర కి ప్రభుత్వం వారు చెల్లించే గౌరవ వేతనంలో కోత ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 3500 రూపాయలు ఉన్న గౌరవ వేతనాన్ని 8500 రూపాయలుగా గోపాల మిత్రలకు ఖరారు చేసింది. ముఖ్యమంత్రి చంద్ర శేఖర్ రావు కి గోపాల మిత్రల యొక్క కృతజ్ఞతలు, వారి యొక్క కుటుంబాలు మీకు రుణపడి ఉన్నాయని తెలియజేశారు. గోపాలమిత్రల యొక్క ముఖ్య కర్తవ్యం కృత్రిమ గర్భధారణ అయినప్పటికిని ఎటువంటి ఆర్డర్ కాపీలు ఇవ్వకుండా పశుసంవర్ధక శాఖ నిర్వహించే అన్ని కార్యక్రమాలు అనగా పశుగర్భకోశ చికిత్స వైద్య శిబిరాలు, జీవాలలో నట్టల నివారణ, పశుగ్రాసాల పెంపకం, దూడల యొక్క పోషణ, రైతు అవగాహన సదస్సులు, పశువులలో టీకాల కార్యక్రమం మొదలగు అన్ని రకాల కార్యక్రమాలలో పని చేపిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం రావాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన ఎటువంటి స్పందన లేదు. కనీసం ఇచ్చే 8500 కూడా గత 4 నెలలుగా రావడం లేదని పెరిగిన ధరలకు కుటుంబ పోషణ భారంగా మారడంతో పలు జిల్లాల్లోని గోపాల మిత్రులు ఎ మానసిక వేదనతో గుండెపోటు మరణాలు, ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయి. నిత్యం ద్విచక్ర వాహనం పై గ్రామాలలో సేవలందించడానికి వెళుతున్న గోపాల మిత్రలకి కనీసం ప్రమాద భీమా సౌకర్యం కూడా లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ గోపాలమిత్రల యొక్క సేవలను గుర్తించి పెండింగ్లో ఉన్న వేతనాలను విడుదల చేస్తూ గోపాల మిత్రలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని, పశుసంవర్ధక శాఖను వేడుకుంటున్నారు. నాటు పశువు అంటే సుమారు 10 నుండి 15 వేల రూపాయల విలువ గల పశువుకు వీరి కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి దూడలు జన్మించడం వలన వాటి యొక్క విలువ దాదాపు 50000 రూపాయల నుండి 70000 రూపాయల వరకు ఉండడం వలన వీరికి చాలా మేలు జరుగడం తో పాటు పాడి రైతుల యొక్క కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతున్నారు. నిత్యం గ్రామాల్లో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటారు. వీరి ద్వారా విజయ డైరీ కి పాల సేకరణ, పాలు పాల ఉత్పత్తులు అమ్మకాల్లో కీలకమైన పాత్ర ఉంటుంది. దీని వలన విజయ డైరీ కూడా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం వారు కృత్రిమ గర్భధారణకు లక్ష్యాలను నిర్ణయించకుండా రైతులకి ఉచితంగా ఎద సూదులను ఇవ్వడం ద్వారా అటు రైతులకి, ఇటు ప్రభుత్వానికి కూడా మేలు జరుగుతుందని పలు రైతు సంఘాలు విన్నవించడం జరుగుతుంది. గోపాల మిత్రలకు జరుగుతున్న అన్యాయం గురించి.పై విషయానుసారం తమరితో మనవి చేయు విషయం ఏమనగా గత 23 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమను పట్టించుకోకుండా పశు సంవర్ధక శాఖ లో ఇతరులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వడం పట్ల నిరసన తెలియజేస్తూ ఈ రోజు నుండి మేము డిపార్ట్మెంట్ కార్యక్రమాలు చేయబోమని, కేవలం కృత్రిమ గర్భధారణ విధులు మాత్రమే నిర్వహిస్తామని తెలియజేస్తున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ తెలంగాణలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

# నిరుపేద పిల్లలకు విద్యను అందించడంమన ఊరు మన బడి లక్ష్యం

**సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్**




**జగిత్యాల, సమ సమాజం:** గ్రామాల్లోని నిరుపేద ప్రజల పిల్లలకు విద్యను అందించడం కోసమే ఈ మన ఊరు మన బడి లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల నందిమేడారం నల్లలింగయ్య పల్లె లో గురువారం ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా 13 లక్షల 6 వేల నిధులతో మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మొదటి విడతలో 274 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని,ధర్మపురి నియోజకవర్గంలో మన ఊరు మన బడి క్రింద 91 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసారని మంత్రి వివరించారు.సర్కారు పాఠశాలలకు సకల హంగులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'మన ఊరు %--% మన బడి', 'మన బస్తీ %--% మన బడి' కింద సకల వసతులతో ఆధునికీకరించిన ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఆయన తెలిపారు.తొలి విడతలో రూ.3,497.62కోట్లతో 9,123 స్కూళ్లను 12 అంశాలను ప్రాతిపదికగా తీసుకొని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని ఆయన చెప్పారు. నంది మేడారం నల్లలింగయ్య పల్లెలో ప్రాథమిక పాఠశాల లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మౌళిక సదుపాయాల అభివృద్ధి పనుల ను ప్రారంభించుకోవడం జరిగింది అని అన్నారు.ధర్మారం మండలంలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద ఇప్పటి వరకు 18 పాఠశాలలకు 2 కోట్ల 22 లక్షలు మంజూరు కావడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. నంది మేడారం గ్రామంలో కనివిని ఎరుగని విధంగా అభివృద్ధి చేయడం జరిగింది, 50 పడకల ఆసుపత్రి నిర్మాణం అనేది ఒక వరం, ఇది ప్రజలు గమనించాలని,అంతేకాకుండా డబుల్ రోడ్డు, కులసంఘ భవనాల నిర్మాణం, దాదాపు 80 శాతం రోడ్లు పూర్తి చేయడం జరిగింది, తెనుగు వాడలో గత సంవత్సరం వరదలతో నీరు ఇండ్లలోకి వరదనీరు రావడం, దీనికి ప్రత్యమ్నాయం గా 3 కోట్ల 6 లక్షల తో సైడ్ డ్రైన్ నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు.

**విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది**

రాష్ట్రంలోని 19,800 ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్ లను పంపిణీ చేయడం,30 లక్షల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యారంగంలో సమూల మార్పు కనిపించిందని గురుకులాలు, హాస్టళ్లు, యూనివర్శిటీలు మనబడి కార్యక్రమం ద్వారా ఆధునీకరించి తరగతి గదులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయన్నారు.సీఎం కేసీఆర్ విద్యావ్యవస్థలో రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా మంచి ఫలితాలు సాధించారని, పూర్తిస్థాయిలో విద్యావ్యవస్థలో మార్పులు తీసుకు వచ్చే దిశగా మన ఊరు మన బడి కార్యక్రమాన్ని సీఎం రూపొందించారని మంత్రి కొప్పుల వివరించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్ఎంల మౌన నిరసన




**జగిత్యాల,సమ సమాజం: :** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆరు రోజులుగా వివిధ రకాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నారు. గురువారం జగిత్యాల జిల్లాలోని ఏఎన్ఎం లు వారు పని చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద మౌన దీక్ష చేశారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన మాదిరిగా మమ్మల్ని సైతం గుర్తించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ తో 6 రోజులుగా నిరసన తెలుపుతున్నామని ఏఐటీయూసి కి అనుబంధంగా కొనసాగుతున్న రాష్ట్ర ఏఎన్ఎం ల సంఘం ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ తెలిపారు. రెగ్యులరైజ్ చేస్తామని ఈనెల 15 వరకు ప్రభుత్వం నిర్ణయం తెలుపాలని లేకుంటే సమ్మె చేస్తామని మధురిమ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు ఐక్యంగా ఉండి హక్కుల కోసం చేస్తున్న స్ఫూర్తి ఆదర్శమన్నారు. ఇదే పోరాట పటిమ ప్రభుత్వం దిగివచ్చే వరకు కొనసాగిద్దామని సహకరిస్తున్న వారందరికీ పేరు పేరున మధురిమ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయులకు బీజేపీ సంఘీభావం

**జగిత్యాల, సమ సమాజం:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం టి పి యూ ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, బీజేపీ జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ చిలుకమర్రి మదన్ మోహన్ లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు తో పాటు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతా.

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**జగిత్యాల, సమ సమాజం:** జగిత్యాల జిల్లా కేంద్రం లో నూతన కలెక్టరేట్ వద్ద తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా (తపస్ ) అధ్వర్యంలో చేపట్టిన ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కార్యక్రమంలో గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఉపాధ్యాయు లకు,పాటశాలల అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాల్ని వివరించారు.సమంజసమైన ఉపాధ్యాయుల పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని,పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ నాయకులు దావా సురేష్,తపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరేందర్ రావు, దేవయ్య,ప్రసాద్ రావు,రాజేందర్ రావు, ,తదితరులు ఉన్నారు.

## జిల్లా కలెక్టర్ కు జాతీయ జండా అందజేత



**జగిత్యాల, సమ సమాజం:** ఆజాద్ క అమృత్ మహోత్సవం లో భాగంగా 76వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు " హర్ ఘర్ తిరంగా' 2.0 కార్యక్రమంను ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేయాలన్న నినాదం తో తపాలా శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా ను విక్రయిస్తున్న క్రమం లో ప్రధాన తపాలా కార్యాలయంలో జాతీయజెండా ఉత్సవాలను జరుపుకుంటున్నారు. కాగా గురువారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ను క్యాంపు ఆఫీసులో హెడ్ పోస్టు మాస్టర్ రవీందర్, తపాలా సిబ్బందితో మర్యాద పూర్వకంగా కలిసి జాతీయ జెండాను అందజేశారు . ఈ సందర్భంగా పోస్టు మాస్టరు రవీందర్ జిల్లా కలెక్టర్ కు,కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్కూల్ స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలి



**జగిత్యాల టౌన్/సమ సమాజం::** జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ ఆవరణలో జగిత్యాల జిల్లా,మండల పరిషత్ స్కూల్ స్వీపర్ లను రెగ్యులర్ చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే ఆశా వర్కర్లు కు పనికి తగ్గ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే కోరగా సానుకూలంగా స్పందించారు. వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. వెంట బి అర్ ఎస్ నాయకులు దావా సురేష్ తదితరులు ఉన్నారు.

## జంగమ కుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలి



**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** జంగమ కుల సమాజానికి సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలంతో పాటు భవనానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయాలని గురువారం ఆ సంఘానికి చెందిన పెద్దలు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లాలో 80 జంగమ కుల కుటుంబాలు ఉన్నాయని, ప్రతి నెల సంఘ సమావేశం జరుపుకుంటామని జంగమ సమాజానికి జగిత్యాల జిల్లా కేంద్రంలో స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. స్థల మంజూరు తో పాటు సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కే.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి గంటి మఠం నిరంజన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాల ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**జగిత్యాల టౌన్సమ సమాజం:** జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో గల ఎస్సీ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలను గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భోజనం, విద్య , మౌలిక వసతులను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే డ్రైనేజీ సమస్య విషయంలో పి.అర్ అధికారులను ఎస్టిమేట్ చేయాలని, డైనింగ్ హాల్ విషయంలో పలు సూచనలు చేసి, కళాశాలలో వివిధ కోర్సు లో విద్యార్థుల ఖాళీలు తెలపాలని,50 శాతం స్థానికత పాటించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు దావా సురేష్ ప్రిన్సిపల్ శ్రీలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ.

**జగిత్యాల, సమ సమాజం:** కోరుట్ల పట్టణ తొమ్మిదవ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ భర్త, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త పోగుల లక్ష్మిరాజంను ఇటీవల గుర్తు తెలియని దుండగులు కత్తులతో పొడిచి హత్య చేయగా గురువారం స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణలు మృతిచెందిన కార్యకర్త లక్ష్మీరాజం స్వగృహం లో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం మృతుని భార్య కౌన్సిలర్ ఉమారాణిని వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే కె.విద్యాసాగర్ రావు మాట్లాడుతూ లక్ష్మీరాజం పార్టీలో చురుకైన కార్యకర్తగా ఉండేవాడని, వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య,మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమిది పవన్ కార్యకర్తలు తదితర నాయకులు పాల్గొన్నారు.



## డబల్ రోడ్డు పనులు పరిశీలన



**ఆలేరు సమ సమాజం:** ఆలేరు నియోజకవర్గంలో రాజాపేట యాదగిరిగుట్ట నుంచి రాజపేట మీదుగా వైపు 29 కిలోమీటర్ల మేరకు బీట్ రోడ్డు పునరుద్ధీకరణ పనులను బుధవారం వసంతాపురం వద్ద ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పునరుద్ధీకరణ పనులకు ఎనిమిది కోట్ల 50 లక్షలు ఆలేరు నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మంజూరు కృషి చేయడం అభినందనీయం అన్నారు. పనులను త్వరగా పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ తీసుకున్న ప్రభుత్వ విప్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మొగులయ్యకు ఆర్థిక సహాయం చేసిన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

**ఆలేరు సమ సమాజం:** ఆలేరు నియోజకవర్గంలో రాజపేట మండలం



రఘునాథపురం గ్రామం లో ఇటీవల వెన్నుముక సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న కళ్లకుంట్ల మొగులయ్య గారిని హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్లో అడ్మిట్ చేయడం జరిగింది. అత్యవసర చికిత్స నిమిత్తం వెన్నెముక సర్జరీ కోసం సీఎం సహాయనిధి ద్వారా రెండు లక్షల 50 వేల రూపాయలను ఎల్ ఓ సి ద్వారా ఆలేరు శాసనసభ్యులు మరియు . ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి చేతుల మీదిగా అందజేయడం జరిగింది బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వెన్నుముక సర్జరీ కోసం ఎల్ ఓ సి కి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి మరియు ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా కుటుంబ సభ్యులందరం వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజపేట మండల టిఆర్ఎస్ యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ రఘునాథపురం గ్రామ సర్పంచ్ గాడే పెల్లి శ్రావణ్ కుమార్ ఉప సర్పంచ్ పల్లె ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

### జాతీయ పక్షిని రక్షించిన చందనా డెవలపర్స్ కాకతీయ టౌన్షిప్



**దంతాలపల్లి పృథ్వి ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి ఖమ్మం టు వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న చందన డెవలపర్స్ కాకతీయ టౌన్షిప్ నందు జాతీయ పక్షి అయిన నెమలి కాలుగు గాయమై ప్రహరి గోడ పక్కనే నడవలేని స్థితిలో ఉండగా గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వాచ్మెన్ ఉదయ్ సూపర్వైజర్ సతీష్ సేల్స్ డైరెక్టర్ ఇమ్మడి రవికి సమాచారం ఇవ్వడంతో స్థానిక దంతాలపల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ శంకర్ కు సమాచారం ఇవ్వడంతో శంకర్ వచ్చి పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లారు. పక్షులపై ప్రేమ చూపించిన చందన డెవలపర్స్ యజమాన్యానికి పోలీసులు ధన్యవాదాలు తెలిపారు దాదాపు మూడు కేజీల పైన ఉండవచ్చని చందన డెవలపర్స్ యాజమాన్యం తెలిపారు.

## ప్రజల మనిషి ఎంఆర్ఓ శాంతకుమారి: కటికె నర్సింలు



**జహీరాబాద్ సమ సమాజం:** కోహీర్ మండలం నూతన తహసిల్దార్'గా పదవీ భాద్యతలు స్వీకరించిన ఎం. శాంతకుమారి నిజాయితికి నిలువెత్తు నిదర్శనమని, నిస్వార్థ ప్రజాసేవ ద్వారా ఆమె ప్రజల మనిషిగా పేరు నంపాదించుకున్నారని ఖానాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికె నర్సింలు అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి కలెక్టరేట్'లో సూపరింటెండెంట్'గా భాద్యతలు నిర్వహిస్తున్న శాంతకుమారి కోహీర్ మండల తహసీల్దార్'గా బదిలీపై వచ్చారు. తహసీల్దర్'గా గురువారం నాడు బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంఆర్ఓను మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు మరియు జర్నలిస్టులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఎంఆర్ఓ పదవీ భాద్యతల స్వీకరణ కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లతో కలిసి పాల్గొన్న కటికె నర్సింలు నూతన ఎంఆర్ఓకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కోహీర్ మండలం రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు అశోక్ మరియు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల పరిరక్షణకై సమరశీల పోరాటాలు

**కలెక్టరేట్ ఎదుట రెండవ రోజు కార్మిక సంఘాల ధర్నా**



**వరంగల్ సమ సమాజం:** కార్మిక చట్టాల పరిరక్షణకై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి, సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి, బిఆర్ టియు జిల్లా నాయకులు నాయిని రవి, ఐఎఫ్టియు జిల్లా నాయకులు అప్పారావు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రెండో రోజు జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాసమస్యలను, కార్మికవర్గ సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందన్నారు. 73 శాతం సంపద ఒక్క శాతం ఉన్న సంపన్నుల వద్ద కేంద్రీకృతమైందన్నారు. దీనివలన నిరుద్యోగం, కనీసవేతనం, గిట్టుబాటు ధర, ద్రరిద్యం, వలస లాంటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం బరితెగించి తీసుకురావడం వలన వాళ్ల సంపద అనేక రేట్లు పెరిగిందన్నారు. సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా శ్రామికుల శ్రమను దోచే విధంగా తయారు చేసి కార్మికులను కట్టుబానిసలుగా చేస్తోందని విమర్శించారు. అనేక సంవత్సరాలు పోరాటం చేసి బ్రిటిష్ కాలంలోనే సాధించుకున్న నలభై నాలుగు కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించడం సిగ్గుచేటన్నారు. ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ఎనిమిది గంటల పనిదినాన్ని అవహేళన చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలిత రాష్ట్రాల్లో పన్నెండు గంటల పనిదినాన్ని అమలు చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పిన కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంక్, రైల్వే, ఎల్ఐసీ, రక్షణ తదితర రంగాలను ప్రైవేట్ పరం చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. దేశ ప్రజల సహజ సంపదను సంపన్నవర్గాలకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. నూతన పరిశ్రమను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల సంఖ్య మరింత పెంచిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వలన రవాణా ఛార్జీలు పెరగడంతో పాటు నిత్యావసర ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయన్నారు. ప్రజలపై భారం మోపి ప్రజలను దోపిడీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అని ప్రశ్నించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే దేశభక్తా అని ఎద్దేవా చేశారు. కార్మిక చట్టాల పరిరక్షణకై, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుట కొరకై బ్రిటిష్ సామ్రాజ వాదులకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు జక్కు రాజు గౌడ్, కార్మిక సంఘాల నాయకులు దర్మల రామ్మూర్తి, మంచాల తిరుపతి, శంకర్, వేల్పుల సారంగపాణి, సంపత్, రవి ,నాయిని రవి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ & ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరని క్రమబద్ధీకరించాలి

**ఏఐటీయూసీ డిమాండ్**




**హైదరాబాద్ సమ సమాజం:** నేషనల్ హెల్త్ మిషన్ అండ్ హెచ్ఎం స్కీములో దాదాపు 15 వేల మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిన వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారని గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వీరందరినీ వెంటనే పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ యూనియన్ ఎన్.హెచ్.ఎం. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. నేడు ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కోటీలోని కమిషనర్ కార్యాలయం ముందు వందలాదిమంది కార్మికులతో మహాధర్నను నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్లో పీ.హెచ్.ఎం. స్టాఫ్ నర్సులు , ఫార్మసిస్టులు , అకౌంటెంట్స్ , సపోర్టింగ్ స్టాఫ్ ముగ్గురు మెడికల్ అసిస్టెంట్ / ఎం.ఎన్.ఓ. వాచ్మెన్ , స్వీపర్ ..బస్తీ దవఖానా స్టాఫ్నర్స్ సపోర్టింగ్ స్టాఫ్ , బ్లడ్ బ్యాంకు డి.ఈ.ఓ ల్యాబ్ అటెండర్ ఎస్.ఎన్.సి.యూ.డి.ఈ.ఓ సెక్యూరిటీ గార్డ్స్ టీ–హబ్ మేనేజర్ డి.ఈ.ఓ. సపోర్టింగ్ స్టాఫ్ బ్లాక్ లెవెల్ అకౌంటెంట్స్ ఔట్సోర్సింగ్ ఏఎన్ఎంలు ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్సులు ఎన్.అర్.సి. న్యూట్రిషన్ కౌన్సిలర్ సెక్యూరిటీ గార్డ్ సపోర్టింగ్ స్టాఫ్ పిహెచ్సి డి.ఈ.ఓ కాంటిజెంట్ వర్కర్స్ డిఐఇసి సైకాలజిస్ట్ , డెంటిల్ టెక్నీషియన్ , ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్ , సోషల్ వర్కర్ అప్తోమేట్రిస్ట్ ఫిజియోథెరపిస్టులు ఎంసిహెచ్ ఓ.టీ.అసిస్టెంట్ / ఓ.టీ.టెక్నీషియన్ సెక్యూరిటీ గార్డ్ సపోర్టింగ్ స్టాఫ్ ఆయుష్ ఎస్.ఎన్.ఓ / ఎఫ్ఎన్ఓ ఎస్టిఎల్ఎస్ టిబి లెప్రసీ వింగ్ ఆల్ సూపర్వైజర్స్ ఆర్బిఎస్కె ఫార్మాసిస్టులు ఎఎన్ఎమ్లు లాంటి అనేక క్యాడర్ల సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు విడుదల చేసిన 510 జీవో ద్వారా వీరికి తీవ్ర నష్టం జరిగిందని చట్ట ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఈ సిబ్బందికి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. ఎన్ హెచ్ ఎం స్కీములో పనిచేస్తున్న డాక్టర్లను ఏ మాదిరిగా రెగ్యులరైజ్ చేశారు అదే మాదిరిగా మిగతా క్యాడర్ సిబ్బంది అందరిని కూడా క్రమబద్ధీకరించాలని లేనిపక్షంలో రాబోవు రోజులు సమ్మెతో సహా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించినట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ దేవనబోయిన బాపు యాదవ్ , బాలసుబ్రమణ్యం సుమన్ నరసింహ రేవతి , నీలమా మీనాక్షి , రజిత , మంజుల , సరస్వతి జయలక్ష్మి , మధు , జోగా లక్ష్మి , హారిక, భవాని, బాలకృష్ణమ్మ పావని, సందీప్ స్వప్న రాజేశ్వరి సునీత, అనిత సాగర్, జైపాల్, శైలు, వరలక్ష్మి ప్రసన్నకుమారి భారతి, సునంద రాము రవీందర్, రామ్నాథం ఏకుల చిరంజీవి స్వప్న, జ్యోతి కృష్ణవేణి, సంధ్యారాణి నిర్మల, జయలక్ష్మి సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, రసాయనాల నాణ్యత బోర్డులను రైతులకు అందుబాటులో ఉంచాలి

**కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి**





**కొండమల్లేపల్లిసమ సమాజం:** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు,కేరళ ఇంఛార్జ్ గోలి మధుసూదన్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు మండల బీజేపీ నాయకులతో కలిసి కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని వివిధ ఎరువులు, రసాయనాల షాపులను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశంలో సుమారు 1.25 లక్షల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేయడం జరిగినది. కేంద్ర రసాయానాల, ఎరువుల మంత్రిత్వ శాఖ వారి సూచన మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఫర్టిలైజర్స్, ఏజెన్సీ వారు అగ్రికల్చర్ సైంటిస్టులు సూచించే పంటల రకాలు వాటికి ఎరువులు, రసాయనాల వాడే విధివిధానాలను టీవీ ప్రోగ్రాం ద్వారా రైతులు విక్షించే విధంగా ప్రతి షాప్ లో టీవీలను ఏర్పాటు చేయాలని షాప్ లో యాజమాన్యాలకు సూచించారు. ప్రతి షాప్ ముందు కిసాన్ సమృద్ధి కేంద్రం బోర్డులు ఏర్పాటు చేయాలని షాప్ లోనే ఎరువుల రసాయనాల నాణ్యత బోర్డులను రైతులకు అందుబాటులో సూచించాలని కోరారు. అనంతరం మండలాధ్యక్షులు బొడిగె సాంబశివ గౌడ్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తమ్మడబోయిన తారయ్య మాట్లాడుతూ 9 ఏండ్ల నరేంద్రమోడీ పాలనలో రైతులకు ఎన్నో రకాల పథకాలు అందించారని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, లేక వ్యవసాయ పనిముట్లు అన్ని ఒకే చోట సకాలంలో పొందడానికి ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేశారని అన్నారు. భారతీయ జనతా పార్టీ రైతు పక్షపాతి పార్టీ అని, ఇట్టి అవకాశాన్ని రైతులందరు సద్వినియోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పేర్ల జితేందర్ ఉపాధ్యక్షులు పాక నగేష్ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బాబూలాల్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు భూతరాజు భరత్ మైనార్టీ మోచ మండల అధ్యక్షులు ఎండి జహీర్, వివిధ షాపుల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

# గిరిజన తెగల మధ్య గొడవలు సృష్టించచవద్దు!లిప లిప్రపంచ గిరిజన హక్కుల దినాన్ని ప్రభుత్వం నిర్వహించాలి

**ఎం. ధర్మనాయక్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ గిరిజన సంఘం.**

**హైదరాబాద్ సమ సమాజం:** హైదరాబాద్ ఫలక్నామా రవీందర్ నాయక్ నగర్ బస్తీలో ప్రపంచ గిరిజన హక్కుల దినం సందర్భంగా ర్యాలీ, సభ జరిగింది ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్. గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీ రామ్ కుమార్ నాయక్ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో గిరిజన హక్కులను కాలరాశి కుట్ర చేస్తుందని వారు అన్నారు ఇప్పటికి అటవీ సంరక్షణ 2023 చట్టాన్ని తీసుకొచ్చి గిరిజనులను అడివి నుండి దూరం చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు గిరిజన గ్రామపంచాయతీ హక్కులను కాలరాస్తూ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు సర్వస్వం అడివి మీద జీవించే గిరిజనులకు అటవీ నుండి దూరం చేసే కుట్ర చేస్తున్నారు. పెట్టుబడిదారులకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నది రాష్ట్రంలో గిరిజన తెగల మధ్య గొడవలు సృష్టించే కార్యక్రమం బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు మణిపూర్ లో గిరిజన తెగల మధ్య గిరిజనేతురుల మధ్య గొడవ సృష్టించి అక్కడ ఉన్నటువంటి అటవీ సంపదను ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పే కుట్ర చేస్తున్నదని స్పష్టంగా కనబడుతున్నది. వేల మంది గిరిజనులు ప్రాణాలు గాల్లో కలుస్తుంటే ప్రధానమంత్రి నోరు మెదపటం లేదని వారు అన్నారు గిరిజనుల మధ్య గొడవలు సృష్టిస్తూ మహిళలను సైతం అర్ధ నగ్నంగా ప్రదర్శన చేస్తూ అత్యాచారాలు చేస్తున్నారని ఇది పూర్తిగా బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్న హామీ నేటికి నెరవేరలేదని అన్నారు దీనితో ఉన్నత విద్యలో గిరిజన యువకులు నష్టపోయారని వారు ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు తగ్గిస్తూ గ్రామీణ అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం ఆటంకంగ మారిందని అన్నారు. మాడ, ఐటీడీఏలను ఉత్సాహ విగ్రహాలుగా చేసిందని అన్నారు గిరిజన గ్రామాలకి ఐదవ షెడ్యూల్ ఆరవ షెడ్యూల్లో నిబంధనలను గాలికి వదిలేసి పూర్తిగా లాభాలు వచ్చే విధంగా పెట్టుబడిదారులు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని అన్నారు. గ్రామాల హక్కులను కాలరాస్తూ గిరిజనుల హక్కులను కాలరాస్తూ గిరిజనులకు మోసం చేస్తుందని అన్నారు. గిరిజన గ్రామాలకు మౌలిక సౌకర్యాలు లేక అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు నేటికీ విద్య వైద్యం అందక గిరిజనులు తల్లడిల్లిపోతున్నారని వారు కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ గిరిజన హక్కుల దినం రోజైనా వారి నుండి దరఖాస్తులు తీసుకొని సమస్యలు పరిష్కారం చేసే దిశగా పూనుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఎన్నికల రాజకీయం కోసం తమకు రావలసిన హక్కులను పక్కన పెడుతూ మోసం చేసే కుట్ర చేస్తున్నారని వారు అన్నారు గిరిజనులు ఇకనైనా మేలుకొని రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం మరోసారి పోరాటంలోకి రావాలని తమ హక్కులను సాధించుకోవాలని ప్రపంచ గిరిజన హక్కుల దినం రోజున వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వి రామ్ కుమార్ నాయక్.

Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS, H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in